సాక్షి
ఖమ్మం
సోమవారం। 13। జనవరి। 2025



నకిలీ వైద్యం..

జిల్లాలో పలువురు అర్హత లేకున్నా వైద్య నిపుణుల పేరిట క్లినిక్‌లు ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. 8లో



ఒకదానికొకటి ఢీ..

ఓ లారీ ముందు వెళ్తున్న బస్సును. ఆపై మరో కంటైనర్‌ను ఢీకొట్టిన ఘటనతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత కాస్త పెరిగే అవకాశముంది. ఉదయం, రాత్రి మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9–30గంటలకు హెలీకాప్టర్ ద్వారా ఆయన ఖమ్మం కలెక్టరేట్‌కు చేరుకుంటారు. కలెక్టరేట్‌లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలపై మంత్రులు, ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకు రఘునాథపాలెం మండలం మంచుకొండలో ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం రాత్రి మధిరలో బస చేసి మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్ బయలుదేరతారు.

మంత్రి పొంగులేటి...

ఖమ్మం వన్‌టౌన్/కూసుమంచి: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 6గంటలకు కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జరిగే భోగి వేడుకల్లో పాల్గొన్నాక తహసీల్ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్, దుబ్బతండాలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తారు. ఆతర్వాత కలెక్టరేట్‌లో ప్రభుత్వ పథకాలపై జరిగే సమీక్ష, మధ్యాహ్నం రఘునాథపాలెం మండలం మంచుకొండలో ఎత్తిపోతల పథకం శంకుస్థాపన కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొంటారు.

19న మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 19వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయి మాస్టర్స్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్(టీబీఏ) ఉపాధ్యక్షుడు, ఏఎస్పీ జి.వెంకట్రావు వెల్లడించారు. ఖమ్మంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన గతంలోనూ జాతీయ స్థాయి టోర్నీలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యాన మాస్టర్స్ టోర్నీ నిర్వహణ బాధ్యతలు కేటాయించినట్లు తెలిపారు. ఈ పోటీలు 35నుంచి 70 ఏళ్ల పైబడిన వారికి సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ అంశాల్లో జరుగుతాయని చెప్పారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 17వ తేదీలోగా వి.చంద్రశేఖర్(93969 72349)కు అందజేయాలని, ఇక్కడ ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వి.చంద్రశేఖర్, హరీష్, జట్ల శ్రీనివాస్, కొంగర శ్రీనివాస్, డి.సత్యనారాయణ, లక్ష్మణ్‌రావు, పాపారావు, కె.రమేష్, ఎం.అనిల్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద సాగర్ కాల్వలపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమకుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొననున్నారు. ఈ మేరకు బందోబస్తు ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, ఏసీపీ రమణమూర్తి, రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ ఆదివారం పరిశీలించారు. మరోవైపు జలవనరుల శాఖ అధికారులు సైతం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే, జలవనరులశాఖ సీఈ విద్యాసాగర్ గత నెలలో ఉద్యోగ విరమణ చేయగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో శిలాఫలకంపై సీఈ పేరు ఎవరిది రాయించాలనే అంశంపై ఆదివారం రాత్రి వరకు యంత్రాంగం తర్జనభర్జన పడినా ఏ నిర్ణయం తీసుకోన్నట్లు తెలిసింది.

ప్రశాంతంగా టీసీసీ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఖమ్మంలోని ఐదు కేంద్రాల్లో ఆదివారం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రాయింగ్ అభ్యర్థులకు పరీక్షలు జరిగాయి. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించగా, ప్రశాంతంగా ముగిశాయని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

కిన్నెరసానికి పోటెత్తిన పర్యాటకులు

- ఒకరోజు ఆదాయం రూ.50,110

పాల్వంచరూరల్ : సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఆదివారం కిన్నెరసానికి పర్యాటకులు పోటెత్తారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 764 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.27,110 ఆదాయం లభించగా, 300 మంది బోట్ షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.23,000 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.


భోగి మంట వద్ద మేయర్ నీరజ, తదితరులు


రంగులతో తీర్చిదిద్దిన ముగ్గు వద్ద యువతులు


గంగిరెద్దు విన్యాసాలు

సందడి మొదలైంది..

ఊరూవాడ ఘనంగా జరుపుకునే సంక్రాంతి పండుగ సందడి జిల్లాలో మొదలైంది. పండుగలో భాగంగా తొలిరోజైన సోమవారం భోగి, రెండో రోజు మకర సంక్రాంతి, మూడో రోజు కనుమ జరుపుకోనున్నారు. ఈ నేపథ్యాన జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యాన మూడు పండుగలను ఒకేచోట నిర్వహించగా స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకోగా భోగి మంట వెలిగించి మహిళలు చుట్టూ ఆడిపాడారు. – ఖమ్మం గాంధీచౌక్


మామిడితోట చుట్టూ ఫెన్సింగ్‌తో సిద్ధమైన బిర్రులు

బరి గీసి... కాళ్లకు కత్తులతో..

కోడి పందేలకు అంతా సిద్ధం

- తెలంగాణ–ఏపీ సరిహద్దుల్లో బిర్రులు రెడీ
- రూ.లక్షల్లో జూదానికి సై అంటున్న పందెం రాయుళ్లు
- కుక్కుట శాస్త్రమే ప్రామాణికంగా పలువురి పోటాపోటీ

సత్తుపల్లి: సంక్రాంతి పండుగతో పాటే కోడి పందేలూ వచ్చేస్తాయి. ఆనవాయితీ పేరుతో రూ.లక్షల్లో పందేలు, అంతకంటే పెద్దమొత్తంలో పేకాటకు తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో పందెం బిర్రులు సిద్ధమయ్యాయి. పూర్వకాలంలోనూ కోడి పందేలు జరిగేవని చెబుతారు. ఈనేపథ్యాన భోగి, సంక్రాంతి, కనుమ ఈ మూడురోజులు పందేలకు అడ్డూఅదుపు ఉండదు. ఏపీలోని ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలు ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వారావుపేట, మధిర నియోజకవర్గాలకు సరిహద్దుగా ఉండడంతో ఇక్కడ నుంచి వేలాదిగా పందేలకు వెళ్తారు. కొందరు ఆసక్తితో చూడడానికి.. మరికొందరు జూదంలో పాల్గొడానికి వెళ్తుంటారు. జనవరి వచ్చిందంటే ఈ ప్రాంతాల్లో ఏ నలుగురు కలిసినా పందేలు ఎక్కడ జరుగుతున్నాయి, బిర్రులు ఎక్కడ ఉన్నాయి.. ఎవరు నిర్వహిస్తున్నారనే చర్చ సాధారణంగా మారుతోంది.

ఆంధ్రా సరిహద్దుల్లో..

ఆంధ్రా సరిహద్దు మామిడి తోటల్లో ఇప్పటికే పందెం బిర్రులు సిద్ధమయ్యాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన పలువురు కూడా మామిడి, ఆయిల్‌పామ్ తోటలను లీజ్‌కు తీసుకుని బిర్రులు ఏర్పాటుచేసినట్లు సమాచారం. ఆంధ్రాప్రాంతంలో సంప్రదాయం పేరిట పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవనే భావనతో అటు నిర్వాహకులు, ఇటు పందెం రాయుళ్లు ఏపీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

రూ.కోట్లల్లో పేకాట జూదం

కోడి పందేల మాటున రూ.కోట్లల్లో పేకాట జూదం నడుస్తుంది. కోడి పందాలు ఒక ఎత్తయితే.. రాత్రీపగలు తేడా లేకుండా జనరేటర్లు అమర్చి మరీ లోనా–బయట(పేకాట) నిర్వహిస్తుండడంతో నిమిషాల్లో రూ.లక్షల నగదు చేతులు మారి పలువురు రోడ్డున పడిన సందర్భాలు ఉన్నాయి. దీనికి తోడు గుండు పట్టాలతో జూదం నిర్వహిస్తారు. ఈ పది రోజులు ఆంధ్రా సరిహద్దుల్లో జోరుగా పేకాట నడవనుండగా అప్పుడప్పుడు ఘర్షణలు కూడా చోటు చేసుకుంటాయి.

కోడికూత వినిపించిందంటే..

పుంజు పట్టుకొని తిరిగేవాళ్లు.. కేవలం గంటల వ్యవధిలోనే పందెంరాయుళ్లను ఒక చోటకు చేర్చ డం.. పందెం వేయడం.. మళ్లీ స్థలం మార్చడం కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. అయితే, సంక్రాంతి మూడు రోజులు మాత్రం నిర్ణీత ప్రాంతంలోనే భారీస్థాయిలో పందేలు జరుగుతుంటాయి. ఏపీ మాదిరి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పందేలు కాస్తుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పాత కేసుల్లో ఉన్న వారిని బైండోవర్ చేసి హెచ్చరిస్తున్నారు.

పందెం కోళ్లలో రకాలు..

పందెం కోళ్లను ఏడాదంతా ఇష్టంతో పాటు కష్టపడి పెంచుతారు. పౌష్టిక ఆహారం అందిస్తూ ఈత కొట్టించి సిద్ధం చేస్తారు. ఒక్కో కోడి పుంజు ధర రూ.10వేల నుంచి రూ.2లక్షల వరకు కూడా పలుకుతుంది. కాకి, నెమలి, డేగ, సేతువు, పర్ల, పింగళి, పచ్చకాకి, ఎర్రబోర, మైల, కొక్కిరాయి, పండు డేగ, ఎర్రకెక్కిర, అబ్రాస్, నల్లనవల, నల్లమచ్చల సేతువు ఇలా 50 రకాల వరకు ఉండగా.. ప్రాంతాల ఆధారంగా పేర్లు మారుతుంటాయి.


ఎర్ర కెక్కిర రకం


అబ్రాస్ రకం

కుక్కుట శాస్త్రమే ఆధారం!



కోడిపందెం రాయుళ్లు కుక్కుట శాస్త్రం ఆధారంగా ముందుకు సాగుతుంటారు. ఏ సమయాన ఏ నక్షత్రంలో, ఏ రంగు పుంజు పొడుస్తుంది.. యజమాని పేరులోని మొదటి అక్షరాన్ని అనుసరించి ఏ పుంజుపై పందెం కాస్తే మంచిదో చూసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇక కోడి పందేలు జరిగే ప్రదేశం, కోళ్ల యజమానులు కూర్చునే ప్రదేశం, పందెం జరిగే రోజు నక్షత్రం వంటివి కూడా పోటీలో పరిగణనలోకి తీసుకుంటారంటే ఆశ్చర్యం కలగకమానదు. బిర్రు ఏ దిశగా ఉంది, యాజమాని తన కోడి పుంజును ఏ దిక్కు నుంచి తీసుకెళ్తారనే అంశంపై జయపజయాలు ఆధారపడి ఉంటాయని నమ్ముతారు. ఇక బరిలోకి దింపే వరకు పందెం కోడిని బయటకు చూపించడానికి కూడా ఇష్టపడరు. అలాగే, పందెం బిర్రుల వద్ద పుంజుల కాళ్లకు కత్తుల కట్టే వారిని ప్రత్యేకంగా నియమించుకుంటారు.

సాగు భూములకే 'భరోసా'

- ఈనెల 26 నుంచి పెట్టుబడి సాయం
- ఏటా ఎకరాకు రూ.12 వేలుగా నిర్ణయం
- జిల్లాలో 7లక్షల ఎకరాలకు సాయం అందే అవకాశం



ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు తాజాగా మార్గదర్శకాలు విడుదలయ్యాయి. వీటి ఆధారంగా జిల్లాలో 3.42లక్షల మంది రైతులకు 7లక్షల ఎకరాలకు సంబంధించి పెట్టుబడి సాయం అందే అవకాశముంది. గత ప్రభుత్వం రైతుబంధు పేరిట ప్రతీ సీజన్‌లో ఎకరాకు సీజన్‌కు రూ.5 వేల చొప్పున ఏటా రూ.10 వేలు అందించింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన కాంగ్రెస్ పార్టీ రెండు సీజన్లకు ఏటా రూ.15వేల పెట్టుబడి సాయం ఇస్తామని హామీ ఇచ్చింది. పార్టీ అధికారంలోకి వచ్చాక ఏడాదికి పెట్టుబడి సాయం అమలుకు సిద్ధం కాగా రూ.12వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అయితే, అన్ని భూములకు కాకుండా సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు.

కొన్నాళ్లుగా కసరత్తు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుల రుణమాఫీ చేయగా ఆ తర్వాత రైతుబంధు పథకాన్ని రైతుభరోసా మార్చి అమలుకు నిర్ణయించింది. ఈ అంశంపై కొన్నాళ్లుగా కసరత్తు చేస్తూ సంక్రాంతి నుంచి అమలుచేయాలని భావించింది. అయితే ఎన్ని ఎకరాలకు పథకాన్ని పరిమితం చేయాలనే తదితర అంశాలపై చర్చించి ఎట్టకేలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎలాంటి పరిమితి విధించొద్దని నిర్ణయించినప్పటికీ.. సాగు చేసినా, చేయకున్నా సాగుకు యోగ్యమైన భూమిగా గుర్తిస్తే రైతుభరోసా ద్వారా సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకాన్ని ఈనెల 26న గణతంత్ర దినోత్సవం నుంచి ప్రారంభించనున్నట్లు ఇటీవల కలెక్టర్లతో సమీక్షలో సీఎం వెల్లడించారు.

వ్యవసాయయోగ్యమైతే చాలు..

ధరణి(భూభారతి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికే రైతు భరోసా పథకాన్ని అమలు చేసేలా మార్గదర్శకాలు రూపొందించారు. సాగుకు అనుకూలత కలిగి, పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన రైతులకు సాయం అందించాలని నిర్ణయించారు. అలాగే, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులనూ అర్హులుగా ప్రకటించారు. మరోపక్క బండరాళ్లతో కూడిన, వెంచర్లు చేసిన, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సేకరించిన భూములకు సాయం అందదని వెల్లడించారు. ఇక పథకం అమలు పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారానికి బాధ్యులుగా కలెక్టర్లను ప్రకటించారు.

జిల్లాకు రూ.840కోట్లు

జిల్లాలో రైతుల పట్టా భూములు సుమారు 10 లక్షల ఎకరాల మేర ఉంటాయని అంచనా. ఇందులో సాగుకు యోగ్యమైన భూమి 7లక్షల ఎకరాలు ఉంటుందని భావిస్తున్నారు. ఈ భూమిలో 5లక్షల ఎకరాల మేర సీజన్ల వారీగా పంటలు సాగు చేస్తుండగా, మరో 2లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగవుతున్నాయి. సుమారు 3.42 లక్షల మంది రైతులు ఈ భూముల్లో పంటలను సాగు చేస్తుండగా వీరికి రైతు భరోసా ద్వారా సాయం అందే అవకాశముంది. తద్వారా ఎకరాకు రెండు సీజన్లలో కలిపి రూ.12 వేల చొప్పున జిల్లాకు రూ.840 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది.

భూవివాదాల పరిష్కారానికి కృషి

- రెవెన్యూ, అటవీభూముల సరిహద్దుల నిర్ధారణకు చర్యలు
- తొలి దశలో నియోజకవర్గానికి ఒక గ్రామంపై దృష్టి
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


రిటైనింగ్ వాల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవన్‌టౌన్: రెవెన్యూ, అటవీ శాఖల నడుమ భూవివాదాల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా రెవెన్యూ, అటవీ భూముల్లో సమస్యల పరిష్కారం, రెవెన్యూ, ప్రైవేట్ వ్యక్తుల మధ్య భూవివాదాలపై సమీక్షించారు. అసైన్డ్ పట్టాలతో గత 40ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. భూముల సర్వే కోసం ఆధునాతన సామగ్రిని సమకూరుస్తామని చెప్పారు. తొలుత ప్రతీ నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు. జిల్లాలోని 15సర్వే నంబర్లకు సంబంధించి 1,500ఎకరాల్లో రెవెన్యూ, అటవీ సరిహద్దు సమస్య ఉన్నందున పరిష్కరించాలని సూచించారు. కాగా, జిల్లాలో మైనింగ్ క్వారీల కోసం కేటాయించిన భూములు, వస్తున్న ఆదాయంపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కొన్నిచోట్ల అనుమతికి మించి భూముల్లో మైనింగ్ చేస్తుండగా, ఇంకొన్ని చోట్ల గడువు ముగిసినా తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇక నూతన రెవెన్యూ చట్టానికి సంబంధించి నిబంధనల రూపకల్పనకు అధికారులు సలహాలు ఇవ్వాలని మంత్రి తెలిపారు.

భూసేకరణ త్వరగా పూర్తిచేయండి

మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ మున్నేరు తీరం వెంట రూ.690కోట్లతో 17కి.మీ. మేర ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఖమ్మం రూరల్ మండలం వైపు 5.1 కి.మీ.లు, అర్బన్ మండలం మండలం వైపు 1.7 కి.మీ. ప్రభుత్వ భూమి ఉన్నందున పనులు చేపట్టాలని చెప్పారు. మిగతా భూసేకరణ పురోగతిపై ఎప్పటికప్పుడు వివరాలు అందించాలని, ప్రైవేట్ భూముల యజమానులతో చర్చించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో జూలై 15 నాటికి రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. ఈసమావేశాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డీఎఫ్‌ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్, పాలేరు ప్రత్యేకాధికారి రమేష్, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, ఇరిగేషన్ ఈఈ అనన్య తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో రామయ్యకు రాపత్తు సేవ


రామయ్యకు రాపత్తు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన
- పెద్ద ఎత్తున దర్శించుకున్న భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం రామయ్యకు రాపత్తు సేవ జరిగింది. బ్రిడ్జి సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో చైర్మన్ సుదర్శన్ ఆధ్వర్యంలో వైభవంగా సేవ నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ వేడుకగా స్వామి వారిని దేవస్థానం నుంచి తీసుకొచ్చి ఆశీనులు చేశారు.

స్వామివారికి అభిషేకం, సువర్ణ పుష్పార్చన..

దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారాన్ని పురస్కరించుకుని అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేనపూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళం..

దేవస్థానం సన్నిధిలో నిత్యాన్నదాన కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన మారెళ్ల వెంకట అనిల్‌కుమార్, నమిత రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయంలో శివలింగ ప్రతిష్ఠా మహోత్సవం



శివలింగ ప్రతిష్ఠాపన అనంతరం జలాభిషేకం చేస్తున్న భక్తులు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో వందల ఏళ్ల కిందటి శివలింగ పురమ్మ దేవాలయాన్ని పునర్నిర్మించగా.. శివలింగ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జలాభిషేకం చేశారు. తొలుత స్వయంభూగా వెలిసిన శివలింగాన్ని దక్షిణ భాగాన ప్రతిష్ఠించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులంతా పూజకు హాజరుకావడంతో సందడి నెలకొంది.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న కార్తీక్

తల్లాడ: నల్లగొండ జిల్లా కోదాడలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తల్లాడ మండలం నారాయణపురానికి చెందిన చిలమర్తి కార్తీక్ ప్రథమ స్థానంలో నిలిచాడు. హైదరాబాద్‌లోని ఏవీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఆయన పోటీల్లో సత్తా చాటాడు. నిరుపేద కుటుంబమైన చిలమర్తి జోజి – జ్యోతి దంపతుల కుమారుడైన కార్తీక్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించడంపై పలువురు అభినందించారు.

ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమణారావు



ఐ.వీ.రమణారావు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల మేనేజ్‌మెంట్ల అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఐవీ రమణారావు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరగగా ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రస్మా ఖమ్మంలోనే ఏర్పాటైందని తెలిపారు. ఖమ్మంకు చెందిన ట్రస్మా రాష్ట్ర అధికార ప్రతినిధి, దివంగత సూరపనేని శేషుకుమార్‌ను గుర్తు చేసుకున్నారు. అనంతరం రమణారావు మాట్లాడుతూ.. పాఠశాలలను విభాగాల వారీగా విభజించి బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో మువ్వా శ్రీనివాసరావు, వీరారెడ్డి, కాంతారావు, వెంకటేశ్వరరావు, నాసరయ్య పాల్గొన్నారు.

1983వ బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 1983వ బ్యాచ్ ఉద్యోగులు

ఖమ్మంక్రైం: విజయనగరంలో శిక్షణ పొందిన 1983వ బ్యాచ్ పోలీస్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ బ్యాచ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుళ్లు ఆ తర్వాత పదోన్నతిపై వివిధ హోదా ల్లో విధులు నిర్వర్తించారు. ఈ మేరకు తమ బ్యాచ్‌లో మృతి చెందిన 12 మంది సహచరులకు సంతాపం తెలిపారు. అనంతరం శిక్షణ, విధి నిర్వహణలో జ్ఞాపకాలను పంచుకున్నారు. సీఐ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగులు లక్ష్మీనారాయణ, రామారావు, సైదయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ ఏఎస్పీగా రామోజీ రమేశ్



సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏఎస్పీ రమేశ్

ఖమ్మంక్రైం: ఖమ్మం ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీగా రామోజీ రమేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ పోలీస్ శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఆయన్ను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఇటీవల కేటాయించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీపీ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయ వెంట ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకన్నబాబు, సీఐ శ్రీనివాస్ ఉన్నారు. కాగా, గతంలో రామోజీ రమేశ్ ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వర్తించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

నకిలీ వైద్యం.. అధికారుల చోద్యం!

అర్హతకు మించి వచ్చీరాని వైద్యం

- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ క్లినిక్‌లు
- అనుమతులు లేకుండా ఆస్పత్రుల నిర్వహణ
- బలవుతున్న నిండు ప్రాణాలు

● కామేపల్లి మండలం పాతలింగాలకు చెందిన ఎం.శ్రీనివాస్(53) నరాల నొప్పులతో గత కొంతకాలంగా బాధపడుతున్నాడు. అయితే ఎటువంటి అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండా అక్యూపంక్చర్ చికిత్సలు చేస్తూ క్లినిక్ నడుపుతున్న నరేష్‌కుమార్ వద్దకు వచ్చాడు. ఈక్రమంలో తనకు వచ్చీరాని వైద్యం చేయడంతో శ్రీనివాస్ మృతి చెందాడు. దీంతో బంధువులు వైద్య, ఆరోగ్య శాఖకు ఫిర్యాదు చేయగా.. అధికారులు విచారణ చేపట్టి వచ్చీరాని వైద్యం చేయడంతోనే మృతి చెందినట్లు నిర్ధారించి అతడిపై కేసు నమోదు చేయించి, క్లినిక్‌ను సీజ్ చేశారు.



ఎన్‌టీఆర్ సర్కిల్‌లోని కేరళ వైద్యం పేరుతో నడుపుతున్న క్లినిక్‌ను సీజ్ చేసిన వైద్య ఆరోగ్య శాఖ

ఖమ్మంవైద్యవిభాగం: వైద్యం వికటించి మృతి చెందితే ఆందోళన చేపట్టడం, కొందరు యాజమాన్యంతో చర్చలు జరిపి వారు ముట్టజెప్పింది తీసుకోవడం జరుగుతుందే తప్ప నకిలీ వైద్యంపై మాత్రం ఉక్కుపాదం మోపలేకపోతున్నారు. చాన్నాళ్లుగా నగరంలో కేరళ వైద్యం, హెర్బల్ క్లినిక్, ఆక్యూ పంక్చర్, ఫిస్టులా తదితర పేర్లతో కొందరు నకిలీ వైద్యులు పలు ప్రాంతాల్లో అద్దెకు ఉంటూ బోర్డులు పెట్టకుండా నకిలీ వైద్యం దందాకు తెరలేపుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో నకిలీ క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఫిర్యాదులు అందినప్పుడు నామమాత్రపు దాడులు నిర్వహించి హడావిడి చేయడం, ఆతర్వాత యధాతథంగా పట్టింపు కరువవ్వడం సర్వసాధారణమైపోయింది. దీంతో నకిలీ రాయుళ్లు పుట్టుకొస్తూ వారి మాయమాటల్లో పడి అమాయక ప్రజలు తమ ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోంది.

అర్హత, అనుమతులు అక్కర్లేకుండానే..

వారికి అర్హత, అనుమతులు అక్కరలేదు. వచ్చీరాని వైద్యం చేస్తూ డబ్బులు దుండుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా జిల్లా కేంద్రంలో పట్టించుకునే నాథేడేలేరు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే అన్నట్లుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పందిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఫిర్యాదులు అందడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గత గురువారం ట్రంక్‌రోడ్‌లోని అక్యూపంక్చర్ క్లినిక్, ఎన్‌టీఆర్ సర్కిల్‌లో కేరళ వైద్యం పేరుతో నిర్వహిస్తున్న క్లినిక్‌ను సీజ్ చేశారు. కాగా, ఇలాంటి క్లినిక్‌లు రోజుకొకటి పుట్టుకొస్తున్నా.. ప్రభుత్వ యంత్రాంగం కళ్లు మూసుకొని విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బోర్డులు లేకుండానే..

గతేడాది నవంబర్‌లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారులు జిల్లాలో చేపట్టిన తనిఖీల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అర్హత లేకుండానే క్లినిక్‌లు నడుపుతున్నట్లు గుర్తించి 41 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అర్హతకు మించి వైద్యం చేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో వారిపై చర్యలు తీసుకున్నారు. అయితే ఈ మెడికల్ దందాను మాత్రం ఎవరూ అడ్డుకోలేకపోతున్నారు. వైద్య సేవలు అందించే పేరుతో నకిలీలు పలు మార్గాలు వెతుకుతున్నారు. కొందరు ఏకంగా అర్హత లేకున్నా ఎంబీబీఎస్ చదివినట్లుగా తమ పేరు పక్కన బోర్డుపై రాయించుకుంటూ ఆస్పత్రులను నిర్వహిస్తుండడం నకిలీ దందాకు పరాకాష్టగా చెప్పవచ్చు. అయితే మరికొందరు బోర్డులు లేకుండానే క్లినిక్‌లు నడుపుతున్నట్లు ఇటీవల నగరంలో అధికారులు చేపట్టిన తనిఖీల్లో వెలుగుచూసింది. ఎలాంటి బోర్డులు, అనుమతులు లేకుండా మధ్యవర్తులను ఏర్పాటు చేసుకొని కేరళ వైద్యం, ఆక్యూ పంక్చర్, హెర్బల్ క్లినిక్‌ల పేరుతో దందాకు తెరలేపుతున్నారు. వారి వలలో పడే రోగులు రోగం తగ్గకపోగా, ఉన్న పైసలు వదిలించుకుంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

● కల్లూరు మండలానికి చెందిన చందు అనే యువకుడికి ఇటీవల జ్వరం రాగా.. ఓ ఆర్‌ఎంపీ సహకారంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అర్హత లేని వైద్యుడితో చికిత్స అందించగా.. అది వికటించి యువకుడు మృతి చెందాడు. దీంతో బాధితుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టగా.. పోలీసులు వచ్చి వారితో మాట్లాడి శాంతింపజేశారు. బంధువులు వైద్య ఆరోగ్య శాఖకు ఫిర్యాదు చేశారు.

అర్హత లేకుంటే సీజ్



అర్హత లేకుండా క్లినిక్‌లు నడిపినా, ఆక్యూ పంక్చర్, హెర్బల్, కేరళ వైద్యం పేరుతో దందాకు తెరలేపినా నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇకపై ప్రతీ ఆస్పత్రిని తనిఖీ చేసి అర్హత కలిగిన వైద్యులు ఉన్నారా లేదా అని పర్యవేక్షిస్తాం. ఎవరైనా అర్హత లేకుండా వైద్యం అందిస్తున్నట్లు తెలిస్తే మాకు ఫిర్యాదు చేయండి.. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా పోలీసులకు సమాచారం ఇస్తాం. ప్రజలు కూడా నకిలీ వైద్యుల మాటలు నమ్మి వారు చెప్పే ఆస్పత్రులకు వెళ్లొద్దు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. సాధ్యమైనంత మేరకు ప్రభుత్వ సేవలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ బి.కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ

వైఎస్ హయాంలో రూ.1,800కోట్ల నిధులు

- ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే మధిర అభివృద్ధి
- డిప్యూటీ సీఎం భట్టి సతీమణి మల్లు నందిని



ముగ్గులను తిలకిస్తున్న మల్లు నందిని తదితరులు

మధిర: దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగిన మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గానికి రూ.1,800 కోట్లు మంజూరు చేయించారని ఆయన సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని తెలిపారు. ఆ తర్వాత అభివృద్ధి కుంటుపడగా మళ్లీ ఇప్పుడు డిప్యూటీ సీఎం హోదాలో రూ.3 వేల కోట్ల మేర నిధులు కేటాయించారని చెప్పారు. మధిర సుందరయ్య నగర్ వెల్ఫేర్ కమిటీ, కౌన్సిలర్లు మల్లాది వాసు – సవిత ఆధ్వర్యాన ఆదివారం సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు నందిని బహుమతులు అందజేశాక మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక భట్టి విక్రమార్క ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మధిర నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. అనంతరం పోటీల నిర్వాహకులు వాసు – సవిత మాట్లాడుతూ.. నాలుగు సార్లు మధిరలో భట్టి విక్రమార్క గెలుపులో నందినమ్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో సినీ నటీనటులు శ్రీనివాస్‌రెడ్డి, రజిత, లక్ష్మి, సౌందర్య, మీనాకుమారి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిర్యాల రమణగుప్తతో పాటు దారా బాలరాజు, మునుగోటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన బోధన



నోటిఫికేషన్ బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

పెనుబల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకులాల్లో నాణ్యమైన బోధన జరిగేలా కృషి చేస్తూనే విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. గురుకులాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడగా బ్రోచర్లను ఆమె ఆదివారం గురుకులాల జోనల్ ఆఫీసర్ స్వరూపతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు విద్యకు దూరం కాకుండా తమ ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో అడవిమల్లెల, సత్తుపల్లి, కల్లూరు గురుకులాల ప్రిన్సిపాళ్లు జి.విజయకుమారి, దేవజ్యోతి, దుర్గ, డీసీఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులన్నీ విడుదల చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సత్తుపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న జీపీఎఫ్, సరెండర్ లీవ్, టీఎస్‌జీఎల్ఐలతో పాటు రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల గ్రాట్యుటీ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని పీఆర్టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, బి.రవి డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో ఆదివారం జరిగిన పీఆర్టీయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల ఇక్కట్లు తీర్చేలా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అలాగే, సంక్రాంతి కానుకగా పెండింగ్ డీఏలను ప్రకటించి, హెల్త్‌కార్డులు, మెడికల్ బిల్లులు ఎస్టీఓల ద్వారా చెల్లింపు, పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దుపై నిర్ణయం వెలువరించాలని కోరారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బజ్జూరి వెంకటేశ్వరరావుతో పాటు సంగమేశ్వరరావు, బానోతు శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పరిరక్షణ బాధ్యత అందరిది..



సదస్సులో మాట్లాడుతున్న పాశం యాదగిరి

ఖమ్మంమామిళ్లగూడెం: స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ముఖ్య అంశాలుగా ఏర్పడిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తెలిపారు. ఖమ్మంలోని పీజీ కళాశాలలో తెలంగాణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం '75 వసంతాల భారత రాజ్యాంగం – స్వేచ్ఛ – సమానత్వం – సవాళ్లు'సదస్సు నిర్వహించారు. యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగానికి ముప్పు వాటిల్లితే మేధావులు గళం విప్పాలని సూచించారు. అంతేకాక రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ శ్రమను గుర్తించి అన్ని వర్గాల ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ధనవంతులు ఎన్నికల్లో పోటీ చేస్తుండగా, మేధావులు చట్టసభల్లో అడుగుపెడితేనే సమాజానికి మేలు జరుగుతుందని చెప్పారు. తెలంగాణ చైతన్య వేదిక కన్వీనర్ ములక సురేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కేయూ మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరోజు శ్రీనివాస్‌తో పాటు విజయలక్ష్మి, ఉపేంద్ర, బానోతు భద్రునాయక్, డాక్టర్ వీరస్వామి, గుంతేటి వీరభద్రం, గోపగాని శంకర్రావు, విజయకుమారి, నాగేశ్వరరావు, రవి, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, శోభన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐఈడీ పేలి బాలికకు తీవ్రగాయాలు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబ్ పేలి ఓ బాలిక తీవ్రగాయాల పాలైన ఘటన ఆదివారం జరిగింది. సుకుమా జిల్లా చింతల్నార్ లోని తిమ్మాపూర్ గ్రామ అటవీప్రాంతంలో మావోయిస్టులు ఐఈడీ బాంబు అమర్చారు. తిమ్మాపూరం గ్రామానికి చెందిన బాలిక సోది మల్లె కాలు వేయడంతో తీవ్రంగా గాయపడింది. బాలికకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బయటకు పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఘటనపై చింతల్నార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుల మధ్య ఘర్షణ



ఘర్షణ పడుతున్న యువకులు

ఖమ్మంక్రైం: ఖమ్మంలో ఇరువర్గాలుగా విడిపోయిన యువకులు ఆదివారం ఘర్షణకు దిగారు. ఖమ్మం టూటౌన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న యువకుడు, ఇంకో ప్రాంతానికి చెందిన యువకుడి నడుమ ఘర్షణ తలెత్తింది. ఇది కాస్త పెరగడంతో అపార్ట్‌మెంట్‌లో గొడవ పడిన వీరు కొట్టుకుంటూ రహదారిపైకి చేరారు. ఆ తర్వాత పరస్పరం రాళ్లతో దాడి చేసుకుంటుండగా స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న ఖమ్మం టూటౌన్ పోలీసులు చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని సీఐ బాలకృష్ణ వారిని హెచ్చరించారు.

సీసీ నిఘాలో పర్ణశాల పుణ్యక్షేత్రం

ప్రసాద్ పథకం ద్వారా 32 సీసీ కెమెరాల ఏర్పాటు



కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని పర్ణశాల గ్రామమంతా సీసీ కెమెరాల నిఘాలోకి రానుంది. గతంలోనే దేవస్థానం తరఫున 16 కెమెరా లు ఏర్పాటు చేయగా, ప్రసాద్ పథకంలో మరో 32 కెమెరాలను ఆలయ ప్రాంగణంతో పాటు గ్రామంలో ఏర్పాటుచేసే పనులు మొదలయ్యాయి. గ్రామంలోని సీతవాగు, పార్కింగ్, గోదావరి ఘాట్, ఆలయ రహదారి, ముందు, వెనుక భాగాలు, కొత్త, పాత కుటీరాల సమీపాన, కల్యాణ మండపం దగ్గర ఏర్పాటు చేయిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్ తెలిపారు. కాగా, కెమెరాలను భద్రాచలంలోని దేవస్థానం ప్రధాన కార్యాలయానికి అనుసంధానించి అక్కడి నుంచి అధికారులు పర్యవేక్షించనున్నారు. కాగా, కెమెరాల కాంట్రాక్టర్ రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.వివిధ రాష్ట్రాల నుంచి పర్ణశాలకు భక్తులు వస్తుండగా చోరీలు సర్వసాధారణం కావడంతో ఇప్పుడు వీటిని అరికట్టే అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు. అలాగే, ఆలయ ఉద్యోగుల విధినిర్వహణ మరింత మెరుగుపడే అవకాశాలున్నాయి.

ఒకదానికొకటి పలు వాహనాలు ఢీ

భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు



కొణిజర్లలో నిలిచిపోయిన వాహనాలు

కొణిజర్ల: ఓ లారీ ముందు వెళ్తున్న బస్సును ఢీకొట్టి, అదే వేగంతో మరో కంటైనర్ లారీని ఢీకొట్టింది. అంతేకాక బస్సు దాని ముందున్న లారీని, చెట్టును ఢీకొన్న ఘటన కొణిజర్ల సమీపాన ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ఘటనతో రెండు వైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి ఫ్లైయాష్ లోడ్‌తో వస్తున్న లారీ.. హైదరాబాద్ నుంచి ఒడిశాలోని మల్కన్‌గిరికి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. ఆపై ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ వాహనాన్ని సైతం ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ఘటనలో కంటైనర్ లారీల క్యాబిన్లు నుజ్జునుజ్జయ్యాయి. అంతేకాక లారీడ్రైవర్ ఓర్సు స్వామి, కంటైనర్ డ్రైవర్లు ఆరిఫ్‌ఖాన్, ధర్మేందర్‌యాదవ్‌కు గాయాలయ్యాయి. అయితే, లారీ ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రోడ్డు కిందకు దిగగా డ్రైవర్ ప్రదీప్ తిరిగి రహదారిపైకి చేర్చే క్రమాన చెట్టు కొమ్మను, ముందు ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టాడు. ఆ సమయాన బస్సులో 55 మంది ప్రయాణికులు ఉన్నా ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రాకపోకలకు అంతరాయం

రెండు లారీల క్యాబిన్లు నుజ్జునుజ్జయి ఇరుక్కుపోవడం.. రహదారిపై ఈ ఘటనతో జరగడంతో రెండు వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పండుగ సమయాన స్వస్థలాలకు వెళ్తున్న వారి కార్లు, బస్సులు రెండు గంటల పాటు నిలిచిపోగా పోలీసులు చేరుకుని దెబ్బతిన్న వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్, సీఐ సాగర్, ఎస్ఐ సూరజ్ ఘటనా స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



తనిఖీలు చేపడతున్న పోలీసులు

పెనుబల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి రూరల్, టాస్క్‌ఫోర్స్ సీఐలు ఎంఎల్ ముత్తిలింగయ్య, ఎస్.తిరుపతి హెచ్చరించారు. మండలంలోని పలు తోటల్లో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ.. పందేల స్థావరాలను గుర్తించేందుకు డ్రోన్లను వినియోగిస్తుండగా, గత ఏడాది పందేలు నిర్వహించిన వారు, కోడి కత్తులు కట్టిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. అలాగే, డివిజన్, మండల, గ్రామస్థాయిలో టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. తనిఖీల్లో వీఎం బంజర్ ఎస్ఐ కె.వెంకటేశ్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి: కోడిపందేలు వేస్తున్న ఎనిమిది మందిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. మండల పరిధిలోని తిమ్మంపేట శివారు కోడి పందేలు వేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. రూ.2వేల నగదు, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, నాలుగు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కానిస్టేబుళ్లు తిరుపతి, ధర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

చంద్రుగొండ: ఆరుగురు పేకాటరాయుళ్లను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌హెచ్‌ఓ పాపయ్య కథనం ప్రకారం.. మండల పరిధిలోని రావికంపాడు గ్రామశివారు మిర్చి తోటలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ 1,240 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

గూడ్స్ రైలు ఢీకొని 13 గేదెలు మృతి



మృతి చెందిన గేదెలను బయటకు తీస్తున్న దృశ్యం

కారేపల్లి: పట్టాలు దాటుతున్న జీవాలను గూడ్స్ రైలు ఢీకొనగా 13 గేదెలు మృత్యువాత పడ్డాయి. కారేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు పెంపకందారులు తమ పాడిగేదెలను పెద్ద చెరువు సమీపంలోని బీడుకు తీసుకెళ్లేందుకు ఆదివారం ఉదయం రైల్వే ట్రాక్ దాటిస్తున్నారు. అదే సమయాన డోర్నకల్ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో 13 గేదెలు మృత్యువాత పడగా, మరో రెండింటికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో గూడ్స్ రైలు సుమారు రెండు గంటల పాటు నిలిచిపోయింది. రైల్వే సిబ్బందితో పాటు స్థానికులు గూడ్స్ రైలు కింద చెల్లాచెదురుగా పడిన గేదెల శరీర భాగాలతో పాటు చక్రాల కింద ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటికి తీసేందుకు శ్రమించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా పాడి పశువుల మృతితో సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని పెంపకందారులు వాపోయారు.

తల్లి దగ్గరకు వస్తూ ప్రమాదంలో మృతి



కిరణ్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: తల్లితో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు బయలుదేరిన యువకుడు మార్గమధ్యలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఖమ్మం ప్రశాంత్‌నగర్‌కు చెందిన కిరణ్ (30) ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. ఖమ్మంలోనే ఉంటున్న తల్లితో పండుగ జరుపుకునేందుకు ఆదివారం ఆయన బైక్‌పై బయలుదేరాడు. సూర్యాపేట సమీపాన హైవేపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్లు తెలుస్తుండగా అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయాన అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో వస్తుండగా మృతదేహాన్ని పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం వారి సూచనలతో మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. కాగా, కిరణ్ సెల్‌ఫోన్‌లోని కాల్‌లిస్ట్ ఆధారంగా పలువురికి ఫోన్ చేయగా మృతుడిని గుర్తించి ఆయన తల్లికి సమాచారం ఇచ్చారు.

పండుగ సామగ్రి కోసం వెళ్లి..

ఇల్లెందురూరల్: సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని సామగ్రి కొనుగోలు చేసేందుకు వెళ్లిన యువకుడు విగతజీవిగా ఇంటికి చేరాడు. మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన ఇర్ప నరేశ్ (35) ఆదివారం పండుగ సామగ్రి కొనుగోలుకు బైక్‌పై ఇల్లెందుకు బయలుదేరాడు. జెండాలవాగు సమీపంలో అటవీ ప్రాంతం నుంచి ఒక్కసారిగా గేదెలు రహదారిపైకి చేరాయి. దీంతో బైక్ అదుపుతప్పి గేదెలను ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో ఇల్లెందు నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్న లారీ అతని తల మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.